


**సాయంత్రపు** మసక వెలుతురుతో హైదరాబాదు వైపు దూసుకు పోతున్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో కిటికీ దగ్గర కూర్చున్న గాయత్రి నిర్లిప్తంగా నవ్వు కొంటూ వెనక్కి చేరబడి కళ్ళు మూసుకుంది. కన్ను మూస్తే చాలు అదే సంఘటన.

'ఛ ఛీ తలుచుకొంటేనే, కిరసనాయిల్ పోసుకొని తనను తాను ఎందుకు తగల బెట్టుకో లేదా? అని ఆశ్చర్యం వేస్తోంది. తానింకా బతికే ఉంది. పైగా బ్రతకాలనే ఆశతో, కష్టంతో ప్రయాణం చేస్తోంది. అవును. ఎందుకు చచ్చి పోతుంది? ఏం తప్పు చేసిందని? తనూ మనిషే. అని నిరూపించు కోవడానికే ఈ ప్రయాణం. తన మనసు మీద ఎవ్వరికీ అధికారం లేదని, ఇన్నేళ్ళ నుండీ అది అనుబంధాలకు కట్టుబడి తలవంచిందే తప్ప—ఎవ్వరి అహంకారానికీ తల వంచలేదని తెలియచెప్పేం దుకే ఈ ప్రయాణం.

ఎంత అసహ్యం! ఒక మనిషిని మరొక మనిషి ఇంత దారుణంగా శిక్షించే అధికారం ఎవ రిచ్చారు? 'పెళ్ళి!' అదేగా? హు! పెళ్ళాం అయినంతమాత్రాన పడి ఉండాలని ఉందా? ఎందుకు ఉండాలి? సమాజం ఇలాక నిష్కృతిలేదా? ఇలాక నిష్కృతి చంపేస్తుందా? ఉహుఁ. చంపదు. తనను తాను చంపుకునేటట్లు చేస్తుంది ఈ సంఘం. అందుకే మేమూ చూస్తాను ఎట్లా చేస్తుందో? ఇంత వరకూ జరుగుతున్న దానిని తను మార్చుతుంది. మార్చాలి. మరి కొంత మందికి దారి చూపాలి' అని కసిగా అనుకొంది గాయత్రి, మండుతున్న కళ్ళతో.

జీవితంలో జరిగి పోతున్న సంఘటనల్లా దాటి పోతున్న దీపాలు మాస్తూ, రైలు ఆగిన ప్రతి మజిలీలో ఒక్కొక్క అనుభూతి గుర్తుకు తెచ్చు కొంటూ, అలాగే శిలలా కూర్చుంది గాయత్రి. ఒక్క కుదుపుతో రైలాగింది. ఈ రైలుకి ఇదే చివరి మజిలీ—మనిషికి చావులాగ' అనుకొంటూ, బ్రీఫు కేసు పట్టుకొని క్రిందకు దిగి ప్లాట్ ఫారమ్ అంతా కలియ చూసింది. తన పిచ్చికి తనే నవ్వు కొని బయటికి నడిచింది, ఆటో స్టాండుకు.

చిక్కడపల్లి అడ్రస్ చెపుతూ, 'శారద ఏమం టుందో?' అనుకొంది.

తలుపు తెరిచిన శారద వంట హడావిడిలో ఉన్నట్లు వాలకం.

"గాయత్రీ! ఎంత అదృష్టం! ఎంత అదృష్టం! మా ఇల్లు పావనం అయి పోయింది. రా! రా! ఏమండోయ్! మా గాయత్రి వచ్చింది" అంటూ షేవ్ చేసుకొంటున్న భర్త కో కేక పెట్టి లోపలికి ఈడ్చుకు పోయింది గాయత్రిని.

* * *

"హమ్మయ్య—పని అయింది. ఆఁ ఇప్పుడు చెప్పు—ఏమిటి సంగతి? ఇల్లే వైకుంఠం, సాయ్యే కైలాసం అనుకొనే నీవు, ఇలా చెప్పా పెట్టకుండా వూడి పడ్డావ్, పెళ్ళి అలసట తీర్చు కొందామనా?" గాయత్రి పక్కను చోటు చేసుకొని చేరబడుతూ అంది శారద.

## జి. హేమంత

"ఇంకా ఏం అలసట? పట్టివే ఎందుకో నాలుగు రోజులు నీదగ్గర ఉండాలనిపించి వచ్చేశాను!" అంది గాయత్రి.

"పోనీలే, ఇన్నాళ్ళకో మంచి పని చేశావు. అప్పు డప్పుడు సంసారాల నుండీ దూరంగా పోతూండాలే, బాబూ! అన్నట్లు పాప దగ్గరి నుండీ ఉత్తరాలు వస్తున్నాయా? ఎలా ఉందట కొత్త కాపురం?"

"బాగానే ఉందట. కొత్త కదూ? అంతా బాగుంటుంది." జవాబుగా అంది గాయత్రి.

ఆ తరవాత లోకాభి రామాయణంలో పడి పోయారు స్నేహితురాండ్రిద్దరు.

* * *

ఉదయం మెలకువ వచ్చే సరికే వంటింట్లో చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. ఒక్క క్షణం తన వంటిల్లు జ్ఞప్తికి వచ్చింది. మరుక్షణం ఆ ఊహే ఇష్టం లేనట్లు తల విదిల్చింది గాయత్రి.

'ప్చ్! శారద ఏ పని చెయ్య నివ్వదు. తను వచ్చి అప్పుడే మూడు రోజులయింది. ఎన్నాళ్ళుం టుంది ఇలా? శారదతో అసలు విషయం చెప్పేయ వలసింది. చెపితే ఏం చేస్తుంది? అందరిలాగ అదే నాది తప్పు అంటుందేమో? ఉహు కాదు. అది సమర్థం చేసుకొంటుంది. తను కేమో ఇక్కడనుంచి వెళ్ళి పోవాలని ఉంది. శారదతో చెపితేకాని పని కాదు. దానితో చెప్పాలి." అనుకొంటూ ఎంగా మంచం మీద పొర్లుతూ ఉండగా కాలింగ్ బెల్ వినపడింది.

"హలో! మీరా?! రండి, రండి!" అంటున్న శారద భర్త, రాధాకృష్ణ కొంతులోని ఆశ్చర్యా

స్పష్టంగా వినిపించి చటుక్కున లేచి కూర్చుంది గాయత్రి.

"మీరా? ఇదేమిటండోయ్? రెండు రోజులన్నా కాకుండానే పరుగెత్తుకొచ్చారే! అంత ఉండలేని వాళ్ళు ఎందుకు పంపారన్నా?" అంటూనే "గాయత్రీ! ఎవరొచ్చారో చూడు!" అంటూ కేకవేసి వంటింట్లోకి నడిచింది శారద.

ఎవరు వచ్చారో అర్థమైపోయింది గాయత్రికి. శరీరం మీద గొంగళి పాకినట్లు ఒళ్ళు జలదరించింది. మనసు ముడుచుకు పోయింది. అంతలోనే నిలవరించుకొని, ఒంటినిండా నిర్లిప్తత చుట్టబెట్టుకొని, నిర్వికారంగా డ్రాయింగ్ రూమ్‌లో అడుగు పెట్టింది.

"ఇక్కడి కొచ్చావా? ఇంత పరువు తక్కువ పనేమిటది? చెప్పాపెట్టకుండ వచ్చేస్తే, అక్కడ ఎలా ఉంటాననుకున్నావ్? చిన్నపిల్లలా ఏమిటీ తెలివి తక్కువ పనులు?" గాయత్రిని చూడగానే తెచ్చిపెట్టుకున్న సహనం ఎగిరిపోయినట్లు పరిసరాలు మరిచి అరుస్తున్న రాజారావును విహ్వలంగా చూసింది గాయత్రి.

అక్కడే ఉన్న రాధాకృష్ణ అయోమయంగా చూస్తున్నాడు. కాఫీ కప్పులతో వచ్చిన శారద పరిస్థితి అర్థం అయినదానిలా, రాజారావుకు కప్పు ఇస్తూ—

"ఏమిటండీ, బావా, రాగానే దాన్ని హడలగొట్టేస్తున్నారు! ముందు కాఫీ తాగండి. తరవాత, ఆ గదిలోకి వెళ్ళి హాయిగా దెబ్బలాడుకోండి. గాయత్రీ! తినుకు వెళ్ళవే!" అంటూ భర్తకు వచ్చేయమన్నట్లు సైగచేసింది, తాను వంటింటి వైపు నడుస్తూ శారద.

సిగ్గు, అవమానం అంటే మరిచిపోయిన మర బొమ్మలా వెనుదిరిగింది గాయత్రి. రాజారావు అనుసరించాడు.

"గాయత్రీ! ఏమిటిది? ఎందుకిలా చేశావ్? ఆవేశంలో ఏదో అన్నానని ఇంతపని చేస్తావా? ఎన్నిసార్లు మాటామాటా అనుకోలేదు? ఇంతకన్నా పెద్ద గొడవ ఎన్నిసార్లు జరగలేదు? అన్నిసార్లూ సహించి ఉన్న దానివి, ఈ విషయాన్ని కింతమాత్రం ప్రాముఖ్యమిచ్చి ఇలా చేస్తావా? నీకోసం మీ అన్నయ్యకు, తెలిసిన వాళ్ళకు ఫోన్లు చేస్తే, వాళ్ళ ఆశ్చర్యం నన్ను తలదించుకొనేలా చేసింది. మన పరువు, ప్రతిష్ఠ, వయస్సు, ఇల్లు, సంసారం, మంచి, చెడ్డ — అన్నీ వదిలేసి ఇంత నిర్లిప్తంగా ఎలా రాగలిగావు? ఇన్నాళ్ళ మన కాపురం తరవాత, ఈ వయసులో ఈ పని చేస్తే, మేము తల ఎత్తుకు తిరగాలా? ఛ ఛ! ఇంత సిల్లీగా బిహేవ్ చేస్తావనుకోలేదు! కొత్త కాపురానికి వెళ్ళిన కూతురికి ఎలా నడుచుకోవాలో చెప్పి పంపిన నీవు—ఇలా చేయడం అబ్సర్డ్!" అసహనంగా అన్నాడు రాజారావు.

"అయినా ఇప్పుడేమన్నానని?" తను కాదు అన్నట్లు మాట్లాడకుండా కూర్చున్న గాయత్రిని చూస్తూ మరొకసారి విసుగ్గా అన్నాడు.

మెల్లగా తల ఎత్తింది గాయత్రి.

"నిజమే! ఇంతకన్నా పెద్ద గొడవలే వచ్చాయి మన మధ్య! ఈ ఇరవయ్యేళ్ళ కాపురంలో నేనేనాడూ మీకు ఎదురు చెప్పలేదు. మీ మనసుకు కష్టం కలిగించేటట్లు ప్రవర్తించలేదు. ఇంతకన్నా ఎన్నో తప్పుల్ని క్షమించి నా మనసును రాయి చేసుకున్నాను. ఎందుకు? మీ మనిషిగా, నా మీద నమ్మకంతో అన్న మాటలవి. అందుకే ఆ నమ్మకాన్ని పట్టుకొని ప్రాకులాడుతూ, ఆ మాటల్ని, ఆ అవమానాల్ని దులిపేసుకున్నాను. కానీ ... కానీ, ఇప్పుడు ఇరవయ్యేళ్ళుగా మీతో జీవితం పంచుకొన్న నా మీద మీకు నమ్మకం లేక అన్న మాటను నా మనసెలా సహిస్తుంది? ఛ ఛ! తలుచుకొంటేనే కంపరంగా ఉంది. ఆ మాట — ఆ మాట అనడానికి మీకే బంధమూ అడ్డు రాలేదు. కానీ, ఆ మాట అన్నాక నన్నే బంధమూ ఆపలేకపోయింది! దయచేసి నన్ను క్షమించండి. ఇక నేనా ఇంట్లో అడుగు పెట్టి, మీతో కలిసి జీవించలేను! ఆ గాయత్రి మీ రా మాట అన్న క్షణంలోనే చచ్చిపోయింది. నేను



వేణుగోపలో డు

ఫోటో— కె. ఎస్. ఎస్. రాము (రొడ్డ బిళ్ళాపూర్)

వేరు. మీకు పూర్తిగా పరాయి దాన్ని!" చాలా అప్రియంగా విమాత్రం ఆవేశం లేకుండా, కంటతా పట్టిన పాటం అప్పచెబుతున్నట్లు, శాంతంగా అంది గాయత్రి.

"ఆ. చచ్చిపోయింది! నిజంగా చస్తే ఒక ఏడుపు ఏడ్చి ఊరుకుంటాము. ఇలా పరువు తక్కువ పనులు చేస్తే, ఊరుకునేది లేదు. ఏం చేస్తావ్? ఇన్నాళ్ళ సంసారం వదిలి ఇలా పరాయి ఇళ్ళంట పడి ఉండడానికి సిగ్గు లేదూ?" నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్న గాయత్రిని చూస్తూ, మళ్ళీ విరుచుకు [illegible] రాజారావు.

"చూడండి, శారదా! ఇ దేమన్నా బాగుందా? ఏదో పొరబాటున ఒక మాట అన్నా నిజమనుకొంది. ఆ మాత్రానికి ఇలా చేస్తారా ఎవరన్నా? సంసారం అన్నాక సవాలక్ష గొడవలు వస్తాయి. అంతా ఇలానే చేస్తున్నారా? నలుగురికి తెలిస్తే ఎంత అవమానం

నిన్ను కాక మొన్న కూతురుకి పెళ్ళి చేసి పంపి, ఈ వయసులో ఈ పనులేమిటి?" అప్పుడే వచ్చిన శారదతో ఫిర్యాదుగా అన్నాడు రాజారావు.

"వచ్చిన దగ్గర నుండి మీరు ఆవేశ పడుతున్నారు. ఏం జరిగిందో నా కయితే తెలియదు కానీ, ఒక్క రెండు రోజులు రమ్మంటేకూడా ఆ ఇంటికి బందీ అయిపోయి ఆ బంధనాలు తెంచుకోలేక అదే స్వర్గంగా ఉండిపోయిన గాయత్రి ఈ నాడిలా చేసిందంటే—దాని మనస్సెంత విరిగి పోయిందో ఒక్క క్షణం ఆలోచించండి. ఆవేశ పడ్డానికి ఇది సమయం కాదు. దాన్ని ఒక రెండు రోజులు ఉండనివ్వండి. కాస్త స్థిమిత పడి వస్తుంది. అక్కడికి రాకపోతే, ఈ వయసులో ఇంకెక్కడికి వెళుతుంది చెప్పండి?" నిదానంగా అన్న శారద మాటలకు జవాబు చెప్పలేనట్లు లేచి వెళ్ళిపోయాడు. ఆ సాయంత్రం శారదతో మరొకసారి చెప్పి వెళ్ళిపోయాడు.

* * *

"ఛ ఛ! ఏం మగవాళ్ళు! ఎంత అసహ్యంగా అవమానిస్తారు! ఈ వయసులో ఇన్నాళ్ళు కాపరం చేశాక నిన్ను అనుమానించడం ఎంత సిగ్గు లేని తనం!" ఏహ్యంగా అంది శారద, గాయత్రి చెప్పినదంతా విని.

"అది కాదే. ఆయన నోటితో ఆయన ఎంత అసహ్యంగా ఆ మాట అన్నారో తెలుసా? తల కొట్టుకు చావాలనిపించింది. మొదటినుండి అనుమానం జబ్బున్నా, ఏ నాడూ ఇలా బయట పడలేదు. మళ్ళీ తనకు నా మీద అనుమానం ఉన్నట్లుగా నాకు తెలియకూడదు. తెలుస్తే నేనెక్కడ బాధ పడతానో, తిరగబడతానో, హేళన చేస్తానో అనే భయం. తరవాత నేనే అర్థం చేసుకొని అనుగుణంగానడుచుకుపోవడం మొదలు పెట్టాను. మా మధ్య ఎప్పుడూ, దేనికో ఒక దానికి మానసికంగా దూరం పెరుగుతూనే వచ్చింది. అయినా, నా మనసును ఐరన్ సేఫ్‌లో పెట్టుకొన్నట్లు పెట్టుకొని పిల్లల కోసం, సంఘం కోసం అలా ఆ ఇంటికి అంకితమై పోయాను. అయినా, ఆయన నమ్మకం లేక నా అనురాగ లతను త్రుంచి పారేశారు. ఇంతకూ అశోక్ మా పాపకు పెదమామగారు. వాపీ, వరసా అన్నా చూసుకోకుండా అంత మాట అన్నారంటే, ఆయన మనస్సెంత కుళ్ళిపోయిందో ఆలోచించావా? ఎప్పుడో పెళ్ళయిన కొత్తలో నేనేదో తెలివి తక్కువగా అశోక్ నన్ను చేసుకోవలసిందని చెప్పానులే. అయితే మాత్రం? పెళ్ళికి అతను రాలేదు. పాప నా కూతురని తెలిసి చూడ్డానికి వచ్చాడట. నేను ఆశ్చర్యపోయాను. ఒక్కసారి నవ్వొచ్చింది. అదే విషయం ఈయనతో నవ్వుతూ చెప్పాను. అంతే. మగవాడి అహంకారానికి హద్దు లేదు, శారదా! ఆయన అంత మాట అంటారని వూహించని నాకు, ఆ మాట ఎక్కడ తగలాలో అక్కడే తగిలింది. ఇంకా ఆ ఇంటికి వెళ్ళి, ఆయన మొహం చూస్తూ ఆయనకు సేవలు చేస్తూ ఎలా ఉండమంటావ్?" ఆవేదనతో ప్రశ్నిస్తుంటే ఏమీ జవాబు చెప్పలేని దానిలా ఉండిపోయింది శారద.

కాలేజి రోజుల్లో అశోక్, గాయత్రి ప్రేమకోసం తాపత్రయ పడిన మాట నిజమే? ప్రేమ అంటే నమ్మకం లేని గాయత్రి నవ్వులాటగా తీసి పారేసినా, అశోకే తన ప్రయత్నాలు మానలేదు. ఈ లోగానే రాజారావ్‌తో పెళ్ళి కుదిరి పోయింది గాయత్రికి.

'అటువంటి గాయత్రిని ఇంత అవమానకరంగా, ఇంత అసహ్యంగా, ఈ వయసులో అనుమానించి, అవమానించి ఆ రాజారావ్ ఎంత కోల్పోయాడో అతని కెప్పుడు అర్థం అవుతుంది? ఆడదాన్ని మనసున్న మనిషిగా అర్థం చేసుకోలేని రాజారావు లాంటి మగవాళ్ళంతా ఏదో ఒకనాడు, ఎంతో కోల్పోతుంటారు. అది వాళ్ళ దురదృష్టం' అనుకుంది శారద.

పరిష్కారం తోచని శారద, గాయత్రిని తిరిగి ఆ ఇంటికి వెళ్ళమని మాత్రం చెప్పలేకపోయింది. 'ఏం జరుగుతుందో' నని ఎదురు చూస్తూంది.

* * * *

"శారదా! రమణాశ్రమానికి వెళ్ళి పోదామనుకుంటున్నానే! ఇంకేముంది చెప్పు ఈ జీవితంలో? ఉన్న ఒక్క ఆడపిల్లకు పెళ్ళి అయిపోయింది. చెండూ మగవాడు—వాడి మానాన వాడు బతక్కపోడు. ఇంక ఆయనకు నే నెవరో! ఈ వయసులో 'తగుదునమ్మా' అని ఎక్కడికి వెళ్ళి ఉంటాను ఇంత అవమానం కడుపులో దాచుకుని? అందుకే నువ్వర్థం చేసుకుని సహకరిస్తావని నీ దగ్గిరికి వచ్చాను. నాకు ఈ హెల్ప్ చేసి పెట్టు." నిర్వేదంగా అంటున్న గాయత్రిని ఏమీ అనలేక పోయింది శారద. "చూద్దాంలే" అనేసి వెళ్ళిపోయింది.

ఆ రోజే ఉష వచ్చింది బెంగుళూరు నుండి.


"అమ్మా! ఏమిటమ్మా ఇది?" అంటూ బావురుమంది ఉష.

'నీ కెలా తెలుసు నే నిక్కడ ఉన్నానని?" ఆశ్చర్యపోతూ అంది గాయత్రి.

"నాన్న వచ్చారు. అంతా చెప్పారు! అమ్మా! పోనీ, నాన్న ఏదో అన్నారనుకో!"

"పాపా! నీకు తెలియదు!" మధ్యలో గట్టిగా అంది గాయత్రి.

"నా కంతా తెలుసమ్మా! నాన్న అంతా చెప్పారు! ఏదో ఆ క్షణంలో అలా తెలివి తక్కువగా అనేసినందుకు తనూ చాలా బాధ పడుతున్నారు. పశ్చాత్తాప పడుతున్నారు. నువ్వు క్షమించలేవా, అమ్మా? ఇప్పటికే అందరికీ తెలిసిపోయింది. మా అత్తగారూ, వాళ్ళూ ఇంకో రకంగా అసహ్యంగా మాట్లాడుతున్నారు. ప్లీజ అమ్మా! మా కోసం అన్నా నువ్వు నీ నిశ్చయం మార్చుకోవాలమ్మా. నా కెన్నో నీతులు చెప్పావు—



భర్త ఏమన్నా సర్దుకుపోవాలని. . ."

"పాపా! భర్త నిన్ను తనలో భాగంగా గుర్తించినప్పుడు అతను చేసే పొరపాట్లను క్షమించి మనసులో దాచుకొమ్మన్నాను. కానీ. . కానీ, ఇలా అవమానిస్తే? నే నేం చెప్పలేదు. నే నా ఇంట్లో ఆయన మొహం చూస్తూ—ప్చ్! మీ కెవ్వరికీ అర్థం కాదు నా బాధ?" అంతవరకూ ఎడారిలా ఉన్న మనసులో ఎక్కడో వాన కురిసి ఒయాసిస్సులు వెలసినాయి. కదిలి, కదిలి ఏడుస్తున్న గాయత్రిని చూస్తున్న శారద, ఉష—ఇద్దరూ వూరడించ లేకపోయారు.

"నిజమే నమ్మా! నాన్న చాలా అన్యాయంగా ప్రవర్తించారు. కానీ, ఇప్పుడు రియలైజు చేశారు కదా? అనాలోచితంగా అన్నారనుకో, అందుకని ఇన్నేళ్ళ బాంధవ్యాన్ని అందుకొని మమ్మల్ని వదులుకుని, ఇలా చెయ్యడం బాగుందా?

మా భవిష్యత్తు, నాన్నగారి ప్రతిష్ఠ, నాన్నగారేమిటి—పిన్ని, మామయ్య, చుట్టాలు—అంతా, అందరికీ తలవంపులు కాదా? మన సమస్య మనతోనే పోదు కదమ్మా? ఒక్కసారి నీ గురించి నువ్వు ఆలోచించడం మానేసి మా గురించి ఆలోచించు! పుట్టుకతోనే సంఘంలో ముడి పడ్డ మన సమస్యలకు పరిష్కారం కూడా సంఘంతో ముడిపడే ఉంటుంది. నీకు నేను చెప్పవలసిన దాన్ని కాదమ్మా! చిన్న పిల్లలా నువ్విలా మొండితనం చేస్తే ఫలితాలు దారుణంగా ఉంటాయమ్మా! ఆలోచించు!" పెద్ద ఆరిందాలా తనకే నీతులు చెపుతున్న కూతుర్ని చూస్తూ నిస్తేజంగా ఉండిపోయింది గాయత్రి.

గాయత్రి మనసులో రగులుతున్న మహా అగ్నిని అర్థం చేసుకుందుకు ప్రయత్నిస్తూన్నట్లు నిశితంగా చూడసాగింది శారద. ఆ రాత్రే బాబు వచ్చేశాడు.

'ఏమిటమ్మా ఇది! చ చ! చిన్న పిల్లల్లా ఈ దెబ్బలాటలూ, అలకలూ ఏమిటి? అమ్మమ్మ, తాతయ్యా కాబోతున్న ఈ వయసులో ఈ పనులేమిటి? ఫ్రెండ్స్ ముందు తల ఎతుకోలేక పోతున్నాను. ఎలా తెలిసిందో ఏమో? అంతా నవ్వుతున్నారమ్మా!!" వస్తూనే, బుద్ధులు చెప్పడం ప్రారంభించాడు ఇంజనీరింగ్ చదువుతున్న కొడుకు.

"అయినా, అమ్మా! నాన్నగారు పొరపాటు అయి పోయిందని అంటున్నారుగా? ఇంకా రాద్ధాంతం ఎందుకమ్మా సిల్లీగా! ఏదో కోపంలో అనేశారుకాని, డాడీకి మాత్రం నీ సంగతి తెలియదా, ఏం? బయలుదేరమ్మా. డాడీ సరిగా భోజనమే చెయ్యటం లేదు. ఇల్లంతా ఏదోగా ఉంది. పాప కూడా మనతో వస్తుంది. అక్కడి నుండి వెళుతుందిలే, రెండు రోజులుండి. రేపు బయలుదేరండి. పాపా వాళ్ళ మామగారు అదొక రకంగా ఉత్తరం వ్రాశారు. ఏమిటే గొడవంతా అసహ్యంగా!" నిర్లక్ష్యంగా తప్పంతా తల్లిదే అయినట్లు తేల్చేశాడు చందూ.

ఉష, చందూ — ఇద్దరి మాటలూ విన్న శారదకు వాళ్ళ భావాలు సమన్వయంగా ఉన్నాయనిపించింది కాని, గాయత్రి బాధ తను అర్థంచేసుకొంది. అయితే ఆ సమస్య గాయత్రి మాత్రమే పరిష్కరించుకోవలసింది. అంతకన్నా తనూ ఏం చెయ్యలేని నిస్సహాయ స్థితిలో ఇరుక్కుపోయింది. తనూ ఒక భర్తచాటు భార్య! ఆ రాత్రంతా ఏ మూలో

FREE ! **ముత్యాల సరాలు** ఉచితం!

## బ లి

ఈ మధ్య బెంగుళూరు నగరములో 65 సం. రాల లక్ష్మణప్ జీ అనే సాధుగారితో పాటు ఆయన అనుచరులైన లక్ష్మమ్మ, కృష్ణప్ప, షణ్ముగం అను వారిని పోలీసులు చేజిక్కించుకున్నారు. కాళీదేవిని ప్రసన్నురాలిగా చేసి ఆమె ద్వారా దీవెనలను పొందుటకు వీరు శుభం శుభం తెలియని అయిదారు సంవత్సరాల పసిబాలుల రక్తమును ఆ దేవతకు బలిగా ఇచ్చేవారు. 6 సం. రాల సెల్వి, 4 సం. రాల వసంత, 5 ఏళ్ళ ఉమ ఇలాగే ఆ దేవతకు బలి అయ్యారు.

దేవతలను దేవుళ్ళను శాంతి పరచి వారి యొక్క ఆశీర్వాదములను పొందుటకై నరబలి ఇచ్చుట మన దేశములో అనాది కాలమునుండి వచ్చిన అలవాటు. ఈ బలి ఇచ్చుటకు అంగవైకల్యం కలవారు, కురూపులు, హీనకులములో జన్మించిన వారు, వృద్ధులు ఎప్పటికీ పనికిరారు. ఆ దేవతలు కూడ సత్కులసంపన్నుడు, సద్గుణశాలి, సచ్ఛీలవర్తన కల్గిన యువ్వనులనే బలి కోరుకొంటారట.

యేసుక్రీస్తు జన్మించుటకు ఎన్నో సంవత్సరాల పూర్వం ఇశ్రాయేలీయులు కూడ అపరాధ పరిహారార్థ బలులని, దహన బలులని, ప్రాయశ్చిత్తార్థ బలులని, ఇలా రకరకాల బలులను దేవునికి బలి పీఠముమీద అర్పించేవారు. వాటిని అర్పించే యాజకుడుకూడ కళంకములేని వాడుగా ఉండాలి. గ్రుడ్డివారు, కుంటివారు, జరిగిన అవయవములు గలవారు, గూనివారు, గుజ్జువారు, గజ్జిగలవారు, కంటిలో పువ్వు గలవారు, కుష్ఠురోగులు మొదలైన ఏ కళంకము వున్న వారైన బలు లర్పించే బలి పీఠముసుగూడ సమీపించుటకు వీలులేదు. అంత మాత్రమే గాకుండా వారు జార స్త్రీని, భ్రష్టురాలిని పెనిమిటి విడనాడిన స్త్రీని గాని, పెళ్ళి చేసికొనకూడదు. మరి బలు లర్పించే గొర్రైనా, గొర్రె అయినా, మేక అయినా ఏ దోషము గాని, లోపము గాని, రోగము గాని లేకుండా పరిపూర్ణమైనదిగా ఉండాలని దేవుడు ఆజ్ఞాపించాడు. ఇవన్నీ పాటించుటలో దేవుడు కోరేది "పరిశుద్ధత". బలు లర్పించేవారు పరిశుద్ధతను పాటించాలి. బలియర్పణలుకూడ పరిశుద్ధంగా వుంచాలి. ఇలాటి ఎన్నెన్నో ఆజ్ఞలను దేవుడు తానేర్పరచుకున్న ఇశ్రాయేల్ జనాంగము పాటించాలని ఆజ్ఞాపించాడు. ఇలాంటివి అన్నీ పాత నిబంధన కాలంకు సంబంధించినవే. కాని అర్ధరహితమైనవి మట్టుకు కాదు. ఇలాటివన్నీ దైవకుమారుడు పరిశుద్ధుడు అయిన ఏసుక్రీస్తు శిలువ మ్రానుమీద సమర్పించిన బలియాగమునకు సూచనగా చెప్పబడింది. పాత తలంపులతో నిండిన నరుల రక్తముగాని, ఎద్దు మొక్కయు, మేకల యొక్క రక్తముగాని మానవుల పాపములకు ప్రాయశ్చిత్తం చేయటం అసాధ్యం. మానవులు పదేపదే పాపం చేస్తూనే యున్నారు. ప్రతియేడు ఇలాటి బలులను అర్పిస్తూనే యున్నారు. ఆ పాపమునేది వారిలో ఉన్నదని వారికి సంపూర్ణముగా తెలుసు. బలులు, అర్పణలు, పూర్ణ హోమములు పాపరిహారార్థబలులు, ధర్మశాస్త్రము చొప్పున అర్పింపబడుచున్నవి గాని, పాపరహితుడు, దైవకుమారుడు, సుగుణశీలుడు, యువ్వనుడు అయిన యేసు తన శరీరమును దైవచిత్తానుసారముగా శిలువ మ్రానుమీద అప్పగించుట ద్వారా సకల మానవకోటి కంతటికి ఒక్కసారే ప్రాయశ్చిత్తం చేసి యున్నాడు. ఆయన తన ప్రాణాన్ని పెట్టుటకు, తిరిగి మృత్యుంజయుడై లేచుటకు అధికారము గలవాడు. ఆయన చేసిన బలియర్పణముతో విశ్వసించు ప్రతివారిని ఆయన తన వలె పరిశుద్ధులుగా మార్చి, తన ధర్మవిధులను వారి హృదయము నందు వుంచి వారి పాపములను, అక్రమములను మరెన్నడూ జ్ఞాపకము చేసికొనడు. తన పాపమునకు క్షమాపణ కలిగినదని నిశ్చయము ఏన కొచ్చిన పిమ్మట ఇంక పాప పరిహారార్థబలితో పని వుండదు. అయితే సత్యమును గూర్చి అనుభవ జ్ఞానము పొందిన పిమ్మట బుద్ధి పూర్వకముగా పాపము చేసిన యెడల దేవుని న్యాయతీర్పును ఎదుర్కొన వలసి వచ్చును.

ఉచితం !! ఉచితం !!!

కరుణామయుడైన యేసుక్రీస్తు జీవిత చరిత్ర, ఆయన కమనీయ బోధలు తెలిపే అందమైన పుస్తకం ఉచితంగా పొందదలచుకుంటే మీ చిరునామా ఈ రోజే తెల్పండి. పోసు ఖర్చులు మేమే భరించి ఉచితంగా మీకు పుస్తకం పంపుతాము.

ఫార్ కార్నర్స్,
పోస్టు బాక్సు నెం. 35,
ఖైరతాబాద్,
హైదరాబాద్-4

FAR CORNERS.

GOSPEL MESSAGE INSERTED BY FAR CORNERS.

వించుకొందో, ఏమో మరువాడు ఉదయమే గాయత్రి—

"శారదా! సాయంత్రం వెళ్ళిపోతాం?" అంది నిశ్చలంగా. ఉలిక్కిపడ్డ శారద గాయత్రి కళ్ళలోకి వెతుకుతున్నట్లు చూసింది. నిశ్చలత తప్ప మరేం కనబడలేదు శారదకు.

స్టేషన్‌కు వచ్చిన శారద గాయత్రి చెయ్యి నొక్కింది, ఓదార్పుగా. కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

"ఎందుకే పిచ్చీ! వెళ్ళిపోతున్నాగా? పోనీలే— నీ కోర్కె తీర్చ గలిగాను. నీ సరదా తీరా ఉన్నాను పది రోజులు." అదే చివరిసారి అన్నంత ఆప్యాయంగా చెయ్యి నొక్కింది గాయత్రి.

ఆ నాడు ఒక ఆతమైన నిశ్చయంతో విశాఖ పట్టణం నుండి హైదరాబాదు తీసుకు వచ్చిన ఇదే రైలు ఈ నాడు మరొక రకమైన స్థిర నిశ్చయంతో హైదరాబాదు నుండి విశాఖపట్నం తీసుకు పోతూంది. పిచ్చిగా నవ్వుకొంది గాయత్రి.

* * * *

మూడు రోజుల తరవాత గాయత్రి స్వహస్తాలతో వ్రాసిన ఉత్తరం శారద చేతుల్లో రెపరెపలాడు తూంది.

"శారదా!

మారని ఈ సమాజంలో ఒక మార్పుని సూచిస్తూ కొత్త పుంత నిర్మిద్దామని తెగించాను. ఆడదాని ప్రతి సమస్యకు చావు పరిష్కారం కాకూడదని సవాల్ చేద్దా మనుకున్నాను. కానీ ... కానీ, మారని ఈ మనుష్యులు నాటి మనిషిని సమాధి చేస్తూ, దానిపై కొత్త పునాదులతో సమాజాన్ని పునరుద్ధరిస్తూనే ఉన్నారు. శారదా! నా భర్తకు, నా కొడుక్కు, నా కూతురుకి, 'నా' అనుకొనే నా వాళ్ళందరకూ నేను చచ్చిపోవడమే ఇష్టం. ఇలా తెగించే బదులు నేను చస్తే సంతోషంగా ఒక ఏడుపు ఏడ్చి వూరుకొంటారు. అంతేకాని, చితికి పోయిన నా మనసును వూరడించుకొని నాకు నేను జీవం పోసుకుంటూ నా మానాన నేను బ్రతికి ఉంటే వాళ్ళకు చిన్న తనం! అంతే! వాళ్ళ ఇష్టమే కానీ! శారదా! తూట్లుపడ్డ మనసుతో, రగిలిపోతున్న అవమానాగ్నిలో దహించుకుపోతూ అన్నీ మరిచి ఆయన మాటల్లో, చేతల్లో సిగ్గును విడిచి నేను కలిసి బ్రతకలేను. అందుకే అందరూ పోయే దారి లోనే నేనూ ఒకతెగా పోతున్నాను. ఆడవాళ్ళ సమస్యలకు చివరి పరిష్కారం 'చావు' అని సంఘం వ్రాసిన వ్రాతలను శిరసావహిస్తున్నాను. శారదా! ఈ లోకం నుండి, ఈ మనుష్యుల మధ్య నుండీ శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను. బహుశా ఈ ఉత్తరం నీ చేతుల్లో ఉండేసరికి, మా వాళ్ళు అన్నీ ముగించి తేలికగా నిట్టూరుస్తారేమో, చేతులు దులుపుకొంటూ! నీ లాటి ఆశ్రయమిచ్చే స్నేహితురాలు మళ్ళీ జన్మ అంటూ ఉంటే కావాలని కోరుకుంటూ, నిష్క్రమిస్తున్న

— నీ గాయత్రి."

సోఫాలో కూలబడి వెక్కివెక్కి ఏడుస్తున్న శారద ఏడుపులో, మరి ఎన్నో గొంతులు శ్రుతికలిపినట్లు అనిపించింది. పైన దూరంగా తొంగిచూస్తున్న గాయత్రికి. ★